క్లుప్తంగా

భక్తిభావాన్ని అలవర్చుకోవాలి



గోర్సలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దొరబాబు, నాయకులు

కొత్తపల్లి: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సూచించారు. సీతారాముల కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని గోర్స పురాతన రామాలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే దొరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చెందిన సుమారు 30 ఎకరాల భూమి అన్యాక్రాంతమై కోర్టులో ఉందని, ఈ భూమి ఆలయానికి చెందే విధంగా కృషి చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీ కొండపల్లి సూర్య నాగేశ్వరరావు, పూజ్యం సతీష్‌బాబు, మాజీ సర్పంచులు గంధం అన్నవరం, వాసంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: మండలంలోని మూలపేటకు చెందిన గోగు అప్పారావు ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, కంబాల లక్ష్మణరావు, అద్దా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి వైద్య సేవలు మెరుగుపడాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రమేష్

పిఠాపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి వైద్య సేవలు మెరుగుపడాలని, డెలివరీలు పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రమేష్ సిబ్బందికి సూచించారు. పిఠాపురం మండలం విరవ పీహెచ్‌సీని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వార్డులు, ల్యాబ్‌లు, రికార్డులను తనిఖీ చేశారు. ఆన్‌లైన్ వర్కు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విరవాడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట డాక్టర్లు ఎస్.ఇందిరా, ఎం.సౌమ్య ఉన్నారు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

పెద్దాపురం: పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ బాలామణి ఆదేశించారు. డివిజన్‌లోని 11 మండలాల పరిధిలోని ఈఓ పీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఆమె సమీక్షించారు. డివిజన్‌లో రూ.19.31 కోట్లు బకాయి ఉండగా రూ.14.49 కోట్లు వసూలయ్యాయని తెలిపారు. గ్రామాల్లో ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆమె సూచించారు. కార్యాలయ పరిపాలనాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మాండవ్య నారాయణుని కల్యాణం



మాండవ్యనారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

సామర్లకోట: అతి పురాతన శ్రీ, భూ సమేత మాండవ్యనారాయణస్వామి కల్యాణం శనివారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ భక్త బృందం విష్ణు సహస్రనామ పారాయణ చేసింది. రాత్రి ఆలయ పండితులు చక్రవర్తుల రవి కుమార్, రఘురామ్‌ల ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. 8వ తేది రాత్రి శ్రీపుష్ప యోగోత్సవంతో కల్యాణ ఉత్సవాలు ముగుస్తాయి. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో కల్యాణ ఉత్సవాలు జరుగుతున్నాయి.

రాసేందుకు రెడీ

- పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి



ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ రాస్తున్న విద్యార్థులు



పరీక్షలకు సిద్ధమైన తాటిపర్తి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు

పిఠాపురం: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే 100 రోజుల ప్రణాళిక ద్వారా ప్రత్యేక తరగతుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ప్రత్యేక తరగతులను ముగించుకుని పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యారు. జిల్లాలో ప్రథమ స్థానం సాధించడమే ధ్యేయంగా ఉపాధ్యాయులు ప్రణాళికలను రూపొందించి విద్యార్థులను సిద్ధం చేశారు. ఈ ఏడాది ప్రైవేటు, రెగ్యులర్ విద్యార్థులకు 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సౌకర్యాల కల్పనపై దృష్టి

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన వసతులను కల్పిస్తున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలోనూ మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు, ఫర్నిచర్ తగినంతగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. మానసికంగా విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి ఇంటి దగ్గర తమ పిల్లలకు మానసిక ధైర్యాన్ని నింపాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి తరగతి గదిలో కేవలం 24 మంది విద్యార్థులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. పరీక్షలు రాసే విద్యార్థులకు సకల సౌకర్యాలు ఉండే విధంగా ఇటీవల నాడు–నేడు పనులు పూర్తయిన పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో సైతం సౌకర్యాలు ఉన్న వాటినే మాత్రమే ఎంపిక చేశారు. ప్రతి పాఠశాలలోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కేంద్రాలకు దగ్గర్లో జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గంలో పరీక్ష కేంద్రాల వివరాలు

మండలం	విద్యార్థులు	పరీక్ష కేంద్రాలు	పాఠశాలలు
పిఠాపురం, టౌన్, మండలం	1928	9	30
గొల్లప్రోలు టౌన్, మండలం	1003	5	10
కొత్తపల్లి మండలం	1165	3	12
మొత్తం	4096	17	52

మంచి ఫలితాల సాధనే ధ్యేయంగా...

పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా 100 రోజుల ప్రణాళికను అమలు చేశాం. పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలకు లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పాఠశాలలోనూ ప్రత్యేక తరగతులు, ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహించాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. శిక్షణ పూర్తి కావడంతో విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది మంచి ఫలితాలు వస్తాయన్న నమ్మకం ఉంది.

– సుభద్ర, డీవైఈఓ, పిఠాపురం

విద్యార్థులూ.. విజయీభవ

- రేపటి నుంచి ప్రారంభం
- నియోజకవర్గంలో 17 పరీక్ష కేంద్రాలు

సామర్లకోట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గతంలో ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లు ఉండేవి. ప్రస్తుతం ప్రతి సబ్జెక్టుకు ఒక పేపరు చొప్పున ఆరు పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. 18వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. నియోజకవర్గ పరిధిలో 17 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ఇలా..

సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 214, ప్రభుత్వ హైస్కూల్‌లో 239, ప్రతిభా విద్యానికేతన్‌లో 200, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 220, వేట్లపాలెం హైస్కూల్ ఎలో 248, హైస్కూల్-బీలో 249, నవర హైస్కూల్‌లో 156, వీకే రాయపురం హైస్కూల్‌లో 165, ఉండూరు హైస్కూల్‌లో 187 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దాపురం ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో 280, జేఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో 280, సాగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 235, లూథరన్ హైస్కూల్‌లో 163, చంద్రమాంపల్లి హైస్కూల్‌లో 258, దివిలి సాధన పబ్లిక్ స్కూల్‌లో 132, ఆర్బీ పట్నం జెడ్పీ హైస్కూల్‌లో 168, కట్టమూరు హైస్కూల్‌లో 261 మంది పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య వివరించారు. ఈ సందర్భంగా ఇన్విజిలేటర్లకు స్థానిక బచ్చుఫౌండేషన్ చీఫ్ సూపరింటెండెంట్ శనివారం సూచనలు ఇచ్చారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు



మహిళా సంఘాల సిబ్బందితో ఎమ్మెల్యే పెండెం దొరబాబు



ఉండూరులో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దవులూరి దొరబాబు



సభలో ప్రసంగిస్తున్న వీసీ సాయి ప్రసాద్

పిఠాపురం: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురంలో డ్వాక్రా మహిళలకు శనివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో 7173 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.5.22 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. మూడో విడత ఆసరా సాయాన్ని మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. మహిళల కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులకు ఎమ్మెల్యే పెండెం దొరబాబు బహుమతులు అందజేశారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్దినీడి సుజాత, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, కౌన్సిల్ కోఆప్షన్ మెంబర్ గండేపల్లి బాబీ, కౌన్సిలర్లు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆసరాతో ఆర్థిక భరోసా

పెద్దాపురం: వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు ఆర్థిక భరోసాను తీసుకువచ్చిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీలో భాగంగా శనివారం మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీకి కట్టుబడి సీఎం జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. తొలుత సీఎం జగన్ చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయా సంఘాలకు విడుదలైన ఆసరా చెక్కులను వారు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, పేరింశెట్టి అంబిక, ఆరెళ్లి వీర్రాఘవులు, పెంటకోట సత్తిబాబు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, గుర్రాల యాకోబు పాల్గొన్నారు.

సాధికారతే లక్ష్యంగా..

- ప్రతి మహిళా వ్యాపారవేత్త కావాలి
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి

సామర్లకోట: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం ఉండూరు గ్రామంలో బోయనపూడి, వీకే రాయపురం, పనసపాడు, అచ్చంపేట, గొంచాల, చంద్రంపాలెం, నవర, పవర, పండ్రవాడ, పి.వేమవరం, కాపవరం, ఉండూరు గ్రామాల్లోని మహిళా సంఘాలకు నిర్వహించిన ఆసరా పంపిణీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి అధ్యక్షతన ఏపీఎం బి.ప్రశాంతి మహిళా సంఘాల ప్రగతిని వివరించారు. దవులూరి దొరబాబు మాట్లాడుతూ అచ్చంపేటలోని 69 మహిళా సంఘాలకు రూ.52,67,962, బోయనపూడిలో 33 సంఘాలకు రూ. 26,60,423, వీకే రాయపురంలో 69 సంఘాలకు రూ.47,99,729, చంద్రంపాలెంలో 75 సంఘాలకు రూ.58,21,701, కాపవరంలోని 33 సంఘాలకు రూ.19,18,565, నవరలోని 72 సంఘాలకు రూ.66,75,786, పనసపాడులోని 70 సంఘాలకు రూ.45,33,558, పండ్రవాడలోని 23 సంఘాలకు రూ.15,60,197, పవరలోని 20 సంఘాలకు రూ.12,82,622, ఉండూరు లోని 130 సంఘాలకు రూ.86,08,291 మూడో విడత ఆసరాగా వారి వారి బ్యాంకు ఖాతాల్లో సీఎం జగన్ నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందించారని అన్నారు.

ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి మహిళా వ్యాపార వేత్తలు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మోర్త కుమారి, అకౌంటెంట్ పి.శ్యామ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ములసా శ్రీను, పేర్నీడి వెంకట్రాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా సంఘాల ప్రతినిధులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వేట్లపాలెంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఆసరా పంపిణీలో దొరబాబు మాట్లాడుతూ గ్రామంలో 336 మహిళా సంఘాలకు రూ.2,69,81,661లు వారి వారి బ్యాంకు ఖాతాలో జమ అయినట్టు తెలిపారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నిడదవోలు సురేష్‌చౌదరి, గ్రామ పార్టీ నాయకులు పాలచర్ల సాయిబాబు, గోలి బాబ్జి, నిడదవోలు రాంబాబు వల్లూరి వీర్రాజు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతిలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణం రోజు కూడా కావడంతో వేకువజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేల మంది భక్తులు ఇక్కడకు చేరుకున్నారు. గంటల తరబడి క్యూలోనే నిలుచుని, స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు చేశారు. అన్నదానం, ఇతర విరాళాలు, దర్శనం, కేశఖండన టిక్కెట్ల ద్వారా శనివారం ఒక్క రోజే స్వామివారికి రూ.4,26,492 ఆదాయం సమకూరిందని జిల్లా దేవదాయ శాఖ అధికారి, ఆలయ ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. స్వామి సన్నిధిలో అన్నదానానికి యలమర్తి శ్రీనివాస్, లక్ష్మీ సూర్యకళ దంపతులు (జగ్గంపేట) రూ.70 వేల విరాళం సమర్పించారు.

స్వామివారిని దర్శించుకున్న 'సంకురాత్రి'

పెద్దాపురం: పద్మశ్రీ పురస్కార గ్రహీత, సంకురాత్రి ఫౌండేషన్ అధినేత డాక్టర్ చంద్రశేఖర్ శనివారం శృంగార వల్లభ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఈఓ పులి నారాయణమూర్తి, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం

- హౌసింగ్ చైర్మన్ దవులూరి
- పి.వేమవరంలో గడప గడపకూ..



పి.వేమవరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



పి.దొంతమూరులో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని దీనిలో భాగంగానే ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు ఎలిశెట్టి నరేష్, మాజీ సర్పంచ్ మునిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ ఎలిశెట్టి భీమన్నదొరల ఆధ్వర్యంలో దవులూరి గడపగడపకూ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి పథకాలు అందే తీరును అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులకు వరుసగా సెలవులు రావడంతో అవ్వా, తాతలకు మూడో తేదీన పింఛన్లు అందుతాయని చెప్పారు. అర్హత ఉంటే సచివాలయ సిబ్బంది పథకాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పథకాలు అందని వారిని, మధ్యలో నిలిచి పోయిన వారిని గుర్తించి అర్హులకు పథకాలు అందేలా, సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి అధికారులను భాగస్వాములను చేసినట్టు తెలిపారు. పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పేర్నిడి రాయుడు మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, హుస్సేన్‌పురం ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్, వీఆర్వోలు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పి.దొంతమూరులో 'గడపగడపకూ'

పిఠాపురం: అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం పి.దొంతమూరులో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. గత మూడేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైన్లు, మంచినీటి కుళాయిల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. పార్టీలు, వర్గాలతో సంబంధం లేకుండా అందరికీ పథకాలు అందించమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామాల్లో మంచినీటి వసతి కల్పించడం కోసం జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇస్తున్నామన్నారు. కొందరు తమకు పథకాలు అందడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి వారికి అర్హత ఉంటే కచ్చితంగా పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, కొత్తపల్లి రమణ బాబ్జి, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొప్పన శివనాథ్, పలువురు అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



వాకతిప్పలో సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ సూచించారు. మండలంలోని ఉప్పాడ, వాకతిప్ప గ్రామ సచివాలయాల్లో శనివారం పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులు ఎవరైనా ఉంటే గుర్తించి వారికి పథకాలు అందేలా చూడాలన్నారు. పింఛన్ల పంపిణీలో గ్రామ సర్పంచులతో పాటు సచివాలయ కన్వీనర్ల, గృహ సారథులు పాల్గొనాలని సూచించారు. ఈ నెల 7 నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఉమ్మిడి మేరి, పాలాని దొరబాబు, ఎంపీటీసీలు మేరుగు ఎల్లాజీ, దాకే నాగమహేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు గోపి హరిబాబు, రాపర్తి శ్రీకృష్ణ శ్రీనివాస్, దాకే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కరప: స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనర్‌ను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ నౌడు రామకృష్ణ కథనం మేరకు మండలం వేములవాడ గ్రామానికి చెందిన బాలిక కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకుంటోంది. రోజూ కళాశాలకు వెళ్లి, వచ్చే సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు అనుసరిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు బాలిక తన ఇంటివద్ద సాధారణ బాత్‌రూమ్‌కు వెళ్లింది. అదే సమయంలో నిందితుడు బాత్‌రూమ్ పై నుంచి ఫొటోలు తీయడాన్ని గమనించి, వెంటనే దుస్తులు ధరించి, తలుపులు తెరవగా పారిపోయాడు. నిందితుడిపై చర్య తీసుకోవాలని కోరుతూ బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు.

5న ఢిల్లీలో ధర్నా

సామర్లకోట: కార్మికుల సమస్యలపై ఐదో తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక భగత్ సింగ్ భవనంలో ఈ మేరకు ధర్నా కార్యాచరణపై కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు విడుదల చేయాలని తదితర డిమాండ్లు చేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీ డీసీఎల్ ఈఈ జి.ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లమార్కెట్ సెంటర్, మున్సిపల్ కార్యాలయం, పెద్దవీధి, చిన్నవీధి, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, సత్యనారాయణపురం, సంపెంగతోట, బలుసువారి వీధి, మఠంసెంటర్, అయోధ్యరామపురం, బ్రౌన్‌పేట, రాజీవ్ గృహకల్ప సెంటర్, సాయినగర్,అమ్మాణమ అపార్టుమెంటు ఏరియా, లారీ స్టాండ్ రోడ్డులో విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు.

అచ్చారే.. మత్స్యారే



మత్స్యకారులకు చిక్కిన నెమలి కొనెం చేపలు



టేకు చేపలు



తెల్లసంధువా చేపలు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు భారీగా మత్స్య సంపద చిక్కడంతో శనివారం అమీనాబాదు చేపల రేవు కళకళలాడింది. బోట్లపై వేటకు వెళ్లిన మత్స్యకారులకు భారీ నెమలి కోనెం, టేకు, తెల్ల సంధువాలతో పాటు పలు రకాల చేపలు చిక్కాయి. వీటిని కొనుగోలు చేసేందుకు భారీగా వ్యాపారులు అమీనాబాదు తీర ప్రాంతానికి తరలివచ్చారు. దీంతో తీరంలో సందడి నెలకొంది. సుమారు రూ.10 లక్షల విలువైన కోనెం, టేకు చేపలను తమిళనాడు, కేరళ, హైదరాబాదు, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేసినట్టు వ్యాపారులు తెలిపారు.